# కొత్తపేట డివిజన్ సమస్యలను పరిష్కరించండి

**జీహెచ్‌ఎంసీ కౌన్సిల్‌లో కార్పొరేటర్ వినతి**



కౌన్సిల్‌లో మాట్లాడుతున్న కార్పొరేటర్ పవన్‌కుమార్

**లింగోజిగూడ:** కొత్తపేట డివిజన్ పరిధిలోని ప్రధాన సమస్యలను పరిష్కరించాలని డివిజన్ కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ మంగళవారం జీహెచ్‌ఎంసీ కౌన్సిల్ సమావేశంలో మేయర్, అధికారులను కోరారు. కౌన్సిల్‌లో ఆయన మాట్లాడుతూ, కొత్తపేట డివిజన్ మూసీని ఆనుకొని ఉండటంతో ఇతర ప్రాంతాల నుంచి వరద కొత్తపేట డివిజన్‌లోని పలు కాలనీల మీదుగా మూసీలో కలుస్తోందని తెలిపారు. ముంపు సమస్య అధికంగా ఉండటంతో గతంలో బాక్స్ డ్రైన్ నిర్మాణానికి రూ.6కోట్లు మంజూరు చేశారన్నారు.రోడ్లు తొవ్వి పనులు మధ్యలోనే నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే బాక్స్ డ్రైన్ పనులను పూర్తి చేయాలని కోరారు. డివిజన్‌లోని పలు కాలనీల్లో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, మంచి నీటి పైప్‌లైన్ పనుల కోసం రోడ్లను తొవ్వి మరమ్మతులు చేపట్టకపోవడంతో గుంతలతో ప్రయాణికులు, స్థానికులు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. అధికారుల మధ్య సమన్వయ లోపంతో ప్రజలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. నెలల తరబడి అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నా జీహెచ్‌ఎంసీ, జలమండలి అధికారులు మరమ్మతు పని మాది కాదంటే.. మాది కాదని చెప్పి కాలం వెళ్లదీస్తున్నారని కార్పొరేటర్ పవన్‌కుమార్ ఆరోపించారు.

# ‘పది’ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న అసిస్టెంట్ కమిషనర్ నర్సింగ్‌రావు

**మలక్‌పేట:** పదో తరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని గవర్నమెంట్ ఎగ్జామినేషన్స్ అసిస్టెంట్ కమిషనర్ నర్సింగ్‌రావు ఉపాధ్యాయలకు సూచించారు. మార్చి 18 నుంచి టెన్త్ పరీక్షలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో మంగళవారం మూసారాంబాగ్‌లోని శ్రీస్వామి వివేకానంద సెంటినరీ స్కూల్‌లో సైదాబాద్‌జోన్‌కు చెందిన 22 పరీక్ష కేంద్రాలు, హిమాయత్‌నగర్‌కు చెందిన 26, నాంపల్లి జోన్‌కు చెందిన 20 సెంటర్ల చీఫ్ సూపరింటెండెంట్లు, విద్యాశాఖ అధికారులు, సిబ్బందితో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారికి ఆయన పలు సూచనలు చేశారు. పరీక్షల సమయంలో విద్యార్థులు కచ్చితంగా సమయపాలన పాటించేలా చూడాలన్నారు. పరీక్ష కేంద్రాల్లోకి విద్యార్థులతో ఎలాంటి ఎల్రక్టానిక్ వస్తువులను అనుమతించవద్దని అన్నారు. సమావేశంలో ముషీరాబాద్ డిప్యూటీ ఈఓ చిరంజీవి, సైదాబాద్ డిప్యూటీ ఈఓ రాధాకృష్ణ, హిమాయత్‌నగర్ డిప్యూటీ ఈఓ విజయలక్ష్మి పాల్గొన్నారు.

# నోటి కేన్సర్–దంత ఉచిత వైద్య శిబిరం

**చాదర్‌ఘాట్:** ఇండియన్ డెంటల్ అసోసియేషన్ (ఐడీఏ) డెక్కన్ బ్రాంచ్ ఆధ్వర్యంలో మలక్‌పేటలోని వ్యవసాయ మార్కెట్ వద్ద నోటి కేన్సర్ దంత ఉచిత వైద్య శిబిరాన్ని మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ కార్యదర్శి శ్రీకాంత్ మాట్లాడుతూ, నోటి కేన్సర్‌ను అరికట్టడమే లక్ష్యంగా ఐడీఏ ఏర్పాటు చేసిన ఈ దంత వైద్య శిబిరం ఈనెల 23 వరకు కొనసాగుతుందన్నారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉంటుందన్నారు. శిబిరంలో ఓరల్ కేన్సర్ పరీక్షలు, స్క్రీనింగ్, అవగాహన, సాధారణ దంత పరీక్షలు, చిగుళ్ల వ్యాధులపై పరీక్షలు నిర్వహిస్తామన్నారు. ఇండియన్ డెంటల్ అసోసియేషన్, పనసీయ ఇనిస్టిట్యూట్ ఆఫ్ డెంటల్ సైన్సెస్‌కు చెందిన ఓరల్, మాక్సోలో ఫేసియల్ స్పెషలిస్టులు సహా 15 మంది డెంటల్ సర్జన్లు పాల్గొంటారని తెలిపారు. వివరాలకు 9959154371 సంప్రదించవచ్చన్నారు.

# దంత వైద్యుల సమస్యలను పరిష్కరించాలి



సమావేశంలో పాల్గొన్న యూనియన్ సభ్యులు

**ఎల్‌బీనగర్:** గతంలో తెలంగాణ ప్రభుత్వం జారీ చేసిన జీఓ నం.59లో దంత వైద్యులను తొలగించడం అన్యాయమని తెలంగాణ మెడికల్ అండ్ హెల్త్ కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ సభ్యులు అన్నారు. యూనియన్ ఆధ్వర్యంలో ఎల్‌బీనగర్‌లో కాంట్రాక్ట్ దంత వైద్యుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా యూనియన్ సభ్యులు మాట్లాడుతూ, జీఓ 59లో దంత వైద్యులను కూడా చేర్చాలని, వివిధ విభాగాల్లో ఉన్న దంత వైద్యుల ఖాళీలను గుర్తించి తక్షణమే నోటిఫికేషన్ విడుదల చేసి నియామకాలను చేపట్టాలని కోరారు. దంత వైద్యుల సమస్యలపై తాము గతంలో పలువురు అధికారులను కలిసినా పట్టించుకోలేదని, వెంటనే తమ సమస్యలను పరిష్కరించాలని కోరారు. సమావేశంలో యూనియన్ అధ్యక్షుడు డాక్టర్ శాంతి కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎండీ రఫీ ఉద్దీన్, ఉపాధ్యక్షుడు డాక్టర్ అనిత, నాయకులు డాక్టర్ ప్రజ్ఞ, లావణ్య, కృష్ణవేణి, సన్నీ తదితరులు పాల్గొన్నారు.

# వారసత్వ సంపదను కాపాడతాం



మెట్లబావి పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

**మహేశ్వరం:** ప్రాచీన వారసత్వ సంపదను భావి తరాలకు అందించాలని మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి అన్నారు. మహేశ్వరం మండలంలో రూ.90 లక్షల నిధులతో జరుగుతున్న కొనేరు( మెట్ల బావి) పునరుద్ధరణ పనులను మంగళవారం ఆమె పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ.. నియోజకవర్గంలో పురాతన, ప్రాచీన కట్టడాలు కనుమరుగు కాకుండా భవిష్యత్ తరాలకు అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో మహేశ్వరం మెట్ల బావి పునరుద్ధరణ పనుల కోసం రూ.90 లక్షల నిధులను మంజూరు చేయించామన్నారు. పనులు నాణ్యతతో త్వరితగతంగా పూర్తిచేయాలని అధికారులు, కాంట్రాక్టర్‌కు సూచించారు. అనంతరం మండల పరిధిలోని కల్వకోల్ గ్రామం కేకే బస్తీలోని చర్చి నిర్మాణ పనులను ఆమె పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ పాండుయాదవ్, వైస్ చైర్మన్ వెంకటేశ్వరరెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఆనందం, నాయకులు సుధాకర్‌రెడ్డి, అంబయ్య యాదవ్, థామస్‌రెడ్డి, సమీర్, రాజు నాయక్, ఆదిల్, ప్రభాకర్, బాలయ్య పాల్గొన్నారు.

**ఎమ్మెల్యేకు ఆహ్వానం**

**కందుకూరు:** మండలంలోని పులిమామిడి పరిధిలోని శ్రీచీకటి వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో పాల్గొనాలని కోరుతూ ఆలయ నిర్వాహకుడు రాజశేఖర్‌శర్మ మంగళవారం ఎమ్మెల్యే సబితారెడ్డిని కలిసి ఆహ్వాన పత్రాన్ని అందించారు. ఆయనతో పాటు బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు ఎ.అంజయ్యగౌడ్, పీఏసీఎస్ చైర్మన్ చంద్రశేఖర్, నాయకులు సదానంద్‌గౌడ్, దేవీలాల్ నాయక్ తదితరులున్నారు.

# కృష్ణా పైప్‌లైన్ పనులు ప్రారంభం



నాదర్‌గుల్‌లో పైప్‌లైన్ పనులు ప్రారంభిస్తున్న కార్పొరేటర్

**బడంగ్‌పేట్:** కార్పొరేషన్ పరిధిలోని నాదర్‌గుల్‌లోని 9వ డివిజన్ గ్రీన్‌హోమ్స్ కాలనీలో నూతనంగా కృష్ణా వాటర్ పైప్‌లైన్ల నిర్మాణ పనులను మంగళవారం కార్పొరేటర్ నిమ్మల సునీత ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి బడంగ్‌పేట నగర పంచాయతీ మాజీ వైస్ చైర్మన్, నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చిగురింత నర్సింహారెడ్డి హాజరైనారు. ప్రతి ఇంటికి కృష్ణా వాటర్ అందిస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో నాయకులు సుభాన్‌యాదవ్, శ్రీరామ్‌రెడ్డి, బంగారి అశోక్, చల్మారెడ్డి, సునిల్, కిష్టయ్య, అభిషేక్, కాలనీవాసులు పాల్గొన్నారు.

# అంతా చెత్తమయం!

- డివిజన్‌లో పడకేసిన పారిశుధ్యం
- కంపుకొడుతున్న పరిసరాలు
- దోమల విజృంభణ
- పారిశుద్ధ్య పనులపై కొరవడిన అధికారుల పర్యవేక్షణ



ఎన్‌టీఆర్‌నగర్ కాలనీలో పేరుకుపోయిన చెత్తకుప్పలు

**దిల్‌సుఖ్‌నగర్:** ఆర్‌కేపురం డివిజన్‌లోని కాలనీల్లో ఎక్కడ చూసినా చెత్త కుప్పలే దర్శనమిస్తున్నాయి. రోజుల తరబడి పుట్‌పాత్‌లపై చెత్త కుప్పలు కుప్పలుగా పేరుకుపోతోంది. దీనికి తోడు చెత్త డబ్బాల వద్ద క్రమంగా చెత్తను తొలగించకపోవడంతో స్థానికులు అవస్థలు పడుతున్నారు. పేరుకుపోయిన చెత్తాచెదారం దోమలకు ఆవాసాలుగా మారి దోమల బెడద పెరిగిందని స్థానికులు చెప్తున్నారు. వ్యర్థాల నుంచి వెలువడే దుర్వాసనకు అనారోగ్యం పాలవుతున్నామని కాలనీవాసులు వాపోతున్నారు. చెత్తకుప్పల వద్దే కొందరు బహిరంగ మల, మూత్ర విసర్జనకు పాల్పడుతుండటంతో పరిసరాలు మరింత దుర్గంధభరితంగా తయారవుతున్నాయి. కాలనీల్లో కార్మికులు పారిశుద్ధ్య నిర్వహణ పనులు సక్రమంగా చేపట్టేలా అధికారులు చర్యలు తీసుకోవాలని, పేరుకుపోయిన చెత్త కుప్పలను తొలగించే విధంగా చూడాలని డివిజన్‌వాసులు కోరుతున్నారు.

**అనారోగ్యం పాలవుతున్నాం..**

చెత్తకుప్పలు పేరుకుపోవడం వలన ఎగసివస్తున్న దుర్వాసనతో పాటు దోమలు పెరిగి అనారోగ్యం పాలవుతున్నాం. అధికారులు పర్యవేక్షణ లేకపోవడంతో కార్మికులు పారిశుద్ధ్యం పనులను సక్రమంగా నిర్వర్తించడం లేదు. దీంతో కాలనీ రోడ్లు చెత్తకుప్పలకు నిలయాలుగా మారుతున్నాయి. అధికారులు ప్రత్యేక చొరవ తీసుకుని సమస్యను పరిష్కారించాలి.

– ఎండీ జహంగీర్, ఎన్‌టీఆర్‌నగర్

# కచరాకు కేరాఫ్‌గా ‘సర్కిల్–3’



నాగోలులో ఇదీ పరిస్థితి

**ఎల్‌బీనగర్:** పారిశుద్ధ్యం విభాగం అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఎల్‌బీనగర్ సర్కిల్–3 చెత్తకు కేరాఫ్‌గా మారుతోంది. పారిశుద్ధ్య పనుల నిర్వహణపై అధికారుల పర్యవేక్షణ లేకపోవడమే ఇందుకు కారణమనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. సర్కిల్–3 పరిధిలో సుమారు 400 కాలనీలు ఉన్నాయి.పారిశుద్ధ్య కార్మికులు రోజూ కాలనీల్లోని చెత్తను ఊడ్చిన తర్వాత దానిని అధికారులు డంపింగ్ యార్డుకు తరలించేందుకు చర్యలు తీసుకోవాలి. అయితే, అధికారులు పట్టించుకోకపోవడంతో చెత్త పేరుకుపోయి పరిసరాలు డంపింగ్ యార్డులా మారుతున్నాయి.ఎగసి వస్తున్న దుర్వాసన, దోమల బెడద కారణంగా కాలనీల్లోని ఇళ్లవారు అవస్థలు పడుతున్నారు.

**రోజు వారీగా తొలగిస్తున్నాం..**

రోజు వారీగా కాలనీల్లోని చెత్తను తొలగిస్తున్నా. ఎక్కడా చెత్త కనపడకుండా ప్రతి రోజూ మూడుసార్లు కార్మికులు రోడ్లను శుభ్రం చేసేలా చర్యలు తీసుకుంటున్నాం.

లావణ్య, సర్కిల్ శానిటేషన్ పర్యవేక్షణాధికారి

## ఏసీపీ కృష్ణయ్యకు శుభాకాంక్షలు



**చంపాపేట:** ఎల్‌బీనగర్ ఏసీపీగా బాధ్యతలు చేపట్టిన అమరగాని కృష్ణయ్యను మంగళవారం సమాచార హక్కు ప్రజా చైతన్య సమితి అధ్యక్షుడు అద్దోజు శ్రీనివాసచారి ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా కలిశారు. పూలబొకే అందజేసి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సమితి సభ్యులు చందా పురుషోత్తం, వేనేపల్లి రంగారావు తదితరులు పాల్గొన్నారు.

## మిద్దెల జితేందర్ జన్మదిన వేడుకలు



జితేందర్‌ను గజమాలతో సత్కరిస్తున్న కాంగ్రెస్ నాయకులు

**చంపాపేట:** రాష్ట్ర ప్రదేశ్ కాంగ్రెస్ సేవాదళ్, ఐఎన్‌టీయూసీ అధ్యక్షుడు మిద్దెల జితేందర్ జన్మదిన వేడుకలను మంగళవారం కేబుల్ ఆపరేటర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. చంపాపేటలోని ఐఎన్‌టీయూసీ కేంద్ర కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో పలు జిల్లాల సేవాదళ్ సభ్యులు, సంఘటిత, అసంఘటిత కార్మికులు, కేబుల్ లాపరేటర్స్, కాంగ్రెస్ నాయకులు హాజరై మిద్దెలకు పూల బొకేలు అంద జేసి, గజమాల, శాలువాలతో ఘనంగా సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. నా యకుడు గోపాల్ ముదిరాజ్ ఆధ్వర్యంలో భారీ కేక్‌ను జితేందర్‌తో కట్ చేయించి అందరికీ పంచిపెట్టారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ కసుకుల జనార్దన్‌రెడ్డి, నాయకులు మల్‌రెడ్డి రామిరెడ్డి, శ్రీపాల్‌రెడ్డి, శ్రీనివాస్, మేకల గిరి, సత్తిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## దశలవారీగా బస్తీల అభివృద్ధి

**యాకుత్‌పురా:** దశలవారీగా అభివృద్ధి కార్యక్రమలు చేపడుతున్నామని యాకుత్‌పురా ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మేరాజ్ తెలిపారు. రెయిన్‌బజార్ డివిజన్‌లోని ఇమాం బడా బస్తీలో రూ.8 లక్షలతో చేపట్టే సీసీ రోడ్డు నిర్మాణ పనులను మంగళవారం ఆయన కార్పొరేటర్ మహ్మద్ వసీవుద్దీన్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రతిరోజూ బస్తీల్లో పాదయాత్రలు నిర్వహిస్తూ స్థానికంగా నెలకొన్న ప్రజా సమస్యలను పరిష్కారిస్తున్నామన్నారు. తమ పార్టీ అధినేత, ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ ఆదేశాల మేరకు ప్రజలకు అందుబాటులో ఉంటూ అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని ఆయన తెలిపారు. ఆయనతో పాటు మజ్లిస్ పార్టీ ఏరియా కమిటీ అధ్యక్షులు, జీహెచ్‌ఎంసీ సంతోష్‌నగర్ సర్కిల్ ఇంజినీరింగ్ విభాగం అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# నాయీబ్రాహ్మణ సంఘం నూతన కార్యవర్గం



**మన్సూరాబాద్:** నాయీబ్రాహ్మణ పోచమ్మ సహకార సంఘం, మన్సూరాబాద్ నూతన కార్యవర్గాన్ని మంగళవారం జరిగిన సంఘం సమావేశంలో ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిగా అమరోజు రవికుమార్, ఉపాధ్యక్షుడిగా తమ్మునూరు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా చైన్న నరేష్, కార్యదర్శిగా అక్కనపల్లి సుధాకర్, కమిటీ డైరెక్టర్లుగా గడల శ్రీనివాస్, కోడిదల శ్రీను, కామోజి రమేష్, సభ్యులుగా ప్రసన్న సురేష్, అక్కనపల్లి రాజు, బాల్‌రాజ్, అనిల్, శ్రీకాంత్, మహేష్, శోభన్‌బాబు, రాజేందర్‌లను ఎనుకున్నారు.

# వివక్ష లేని సమాజ నిర్మాణానికి కృషి చేయాలి

**కాచిగూడ:** వివక్ష లేని సమతా ప్రపంచ నిర్మాణానికి పౌర సమాజం కృషి చేయాలని ఇంటర్నేషనల్ సోషల్ జస్టిస్ ఫోరం చైర్మన్, సుప్రీంకోర్టు న్యాయవాది వడ్లమూరి కృష్ణ స్వరూప్ అన్నారు. ప్రపంచ సామాజిక న్యాయ దినోత్సవం సందర్భంగా మంగళవారం నారాయణగూడలో ఆయన మాట్లాడుతూ.. మానవ సమాజం మధ్య ఎలాంటి వివక్ష , అణిచివేత, కుల, మత, లింగ తదితర వివక్షతలు లేకుండా.. ప్రపంచ పౌరసమాజం అంతా సమానత్వం, ఆత్మగౌరవంతో జీవించాలని ఐక్యరాజ్య సమితి యూఎన్‌ఓ 2007లోనే తీర్మానం చేసిందన్నారు. సామాజిక న్యాయం అందకపోతే.. దేశాలు, సమాజం మధ్య అంతర్యుద్ధం వస్తుందని ప్రపంచ దేశాలకు యూఎన్‌ఓ హెచ్చరిక చేసిందని ఈ సందర్భంగా గుర్తు చేశారు. సోషల్ జస్టిస్ సాధన కోసం తీవ్రంగా కృషి చేసిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పోరాట స్ఫూర్తిని ప్రపంచం ఆదర్శంగా తీసుకోవాలన్నారు. డీవీఎల్ రాజు, దళిత బహుజన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బీరం సతీష్‌కుమార్, గణేష్, జీఎన్ రావు, రాజలింగం, చిప్పరి కరుణాకర్, ప్రవీణ్ తదితరులున్నారు.

# పార్టీ పటిష్టతకు ప్రతి ఒక్కరూ పాటుపడాలి

**కాచిగూడ:** పార్టీ అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం కోసం కష్టపడి పనిచేసే కార్యకర్తలకు పార్టీలో తగిన గుర్తింపు ఉంటుందని బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతమ్‌రావు అన్నారు. మంగళవారం బర్కత్‌పురలోని బీజేపీ నగర కార్యాలయంలో ఆయన నియోజకవర్గ కో– కన్వీనర్లను ప్రకటించారు. అంబర్‌పేట అసెంబ్లీ కో– కన్వీనర్లుగా ఎస్. అరవింద్ కుమార్, ఎ.మహేష్, కె.శిరీష, నాంపల్లి అసెంబ్లీ కో –కన్వీనర్లుగా ఎం.బాబురావు, శ్రీనివాస్, ఎస్.సుజాత, ఖైరతాబాద్ అసెంబ్లీ కో –కన్వీనర్లుగా రమేష్, ఎ.లక్ష్మణ్‌రావు, విజయ తులసి, జూబ్లీహిల్స్ అసెంబ్లీ కో– కన్వీనర్లుగా సి.మహేష్, ఎ.శాంతికుమార్, సుప్రియగౌడ్‌లను నియమించారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో సికింద్రాబాద్ నుంచి బీజేపీ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో సికింద్రాబాద్‌తో పాటు కేంద్రంలో బీజేపీ జెండా ఎగురవేస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు.

## వ్యభిచార గృహంపై దాడి

**అబిడ్స్:** వ్యభిచార గృహాన్ని నిర్వహిస్తున్న వారిని గుడిమల్కాపూర్ పోలీసులు పట్టుకున్నారు. ఇన్‌స్పెక్టర్ బైరి రాజు, ఎస్‌ఐ జ్యోతి తెలిపిన వివరాల ప్రకారం.. రేతిబౌలి పిల్లర్ నెంబర్: 36 సమీపంలో వ్యభిచార గృహాన్ని నడుపుతున్నట్లు సమాచారం అందడంతో ఎస్‌ఐ జ్యోతి తన సిబ్బందితో దాడి చేసి మటియో జఖియా ఓతుమన్(24) నిర్వాహకురాలు, జాన్‌పాల్ (33) కస్టమర్, చాండెడె సంపైన్ (25), కుయాసిరా మసోల్వా (26) అనే బాధితులను అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు. వీరంతా టాంజానియా దేశస్తులని తెలిపారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# బెదిరించి డబ్బులు వసూలు.. మహిళ రిమాండ్



నయీమా సుల్తానా

**కాచిగూడ:** బెదిరింపులకు పాల్పడుతూ.. డబ్బులు డిమాండ్ చేస్తున్న ఓ మహిళను కాచిగూడ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఇన్‌స్పెక్టర్ రామలక్ష్మణరాజు తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట ప్రాంతానికి చెందిన సయ్యద్ అహ్మదుద్దీన్ కుమార్తె సాదియా నయీమా సుల్తానా సైదాబాద్‌లో నివాసం ఉంటోంది. ఇటీవల బర్కత్‌పురలోని అన్నపూర్ణ ఉమెన్స్ హాస్టల్‌లో రూమ్ అద్దెకు తీసుకుంది. రాత్రిపూట హాస్టల్‌కు రావడంతో అనుమానం వచ్చిన హాస్టల్ యజమాని ఆధార్‌కార్డు అడిగితే ఉదయం ఇస్తానని నమ్మబలికి 15 రోజులైన ఆధార్ ఇవ్వకుండా, అద్దె చెల్లించకుండా తిరుగుతోంది. రోజూ రాత్రి 11 గంటల సమయంలో బయటకు వెళ్లి తిరిగి ఉదయం 8 గంటల సమయంలో హాస్టల్‌కు వచ్చేదని, రాత్రి బైక్, కార్లలో వెళ్తున్న వారిని లిఫ్ట్ అడిగి కొంతదూరం వెళ్లిన తర్వాత భయభ్రాంతులకు గురిచేస్తుండేదని పోలీసులు తెలిపారు. ఈ క్రమంలో హాస్టల్ యజమాని ఆమె ప్రవర్తన నచ్చక రూమ్ ఖాళీ చేయమని చెబితే తన వద్ద రూ.60 వేలు తీసుకుని వేధింపులకు గురిచేస్తున్నాడని ఆమె కాచిగూడ పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు హాస్టల్ యజమానిని విచారించగా.. జరిగిన విషయం మొత్తం వివరించాడు. అతడి ఫిర్యాదు మేరకు కాచిగూడ పోలీసులు కేసు నమోదు చేసి నిందితురాలిని రిమాండ్‌కు తరలించారు. గతంలో ఆమెపై పలు పోలీస్‌స్టేషన్‌లో 16 కేసులు ఉన్నాయని పోలీసులు తెలిపారు.

## రైతుబజార్లలో కూరగాయల ధరలు

**దిల్‌సుఖ్‌నగర్:** సరూర్‌నగర్/వనస్థలిపురం రైతుబజార్లలో కూరగాయల ధరలు (కిలో...రూపాయల్లో...) టమోటా లోకల్ 13, వంకాయ 23, బెండ 50, పచ్చిమిర్చి 45, కాకర 45, బీర 40, క్యాలీఫ్లవర్ 18, క్యాబేజీ 27, క్యారెట్ 21. దొండ 43, ఆలు 21, ఉల్లి 19, గోకర 45, దోస 19, సొర 11, పొట్ల 18, అరటి 09, చిక్కుడు 45, అర్వి 50, మునగ 55, చిలగడదుంప 60, బీట్‌రూట్ 23, కీర 18, ఫ్రెంచ్ బీన్స్ 45, కాప్సికమ్ 50.

**నేడు రైతుబజార్‌కు సెలవు**

**దిల్‌సుఖ్‌నగర్:** సరూర్‌నగర్ రైతుబజార్‌కు నేడు సెలవు అని రైతుబజార్ ఈఓ స్రవంతి తెలిపారు. ప్రతి నెలా 3వ బుధవారం సెలవు కావున ఈరోజు రైతు బజార్‌లో ఎలాంటి క్రయ విక్రయాలు జరగవని ఆమె పేర్కొన్నారు. గురువారం యథావిధిగా రైతుబజార్‌లో క్రయ విక్రయాలు జరుగుతాయన్నారు. ఈ విషయాన్ని వినియోగదారులు గుర్తించాలని కోరారు.

## పేద యువతి వివాహానికి చేయూత

**లింగోజిగూడ:** యాదాద్రి జిల్లా వలిగొండ మండలం చిత్తాపురం గ్రామానికి చెందిన పేద దంపతులు ఎల్లమ్మ, చంద్రయ్యల కుమార్తె మౌనిక వివాహానికి ఉప్పల ఫౌండేషన్ చేయూతనందించింది. మంగళవారం ఫౌండేషన్ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా పుస్తె, మెట్టెలు, చీర, గాజులను యువతికి అందజేశారు. కార్యక్రమంలో సామాజిక కార్యకర్త నీరు, ఐవీఎఫ్ సభ్యులు రజిత, సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

## అధికారులకు ఎమ్మార్పీఎస్ నేతల సన్మానం



హయత్‌నగర్ సర్కిల్ డీసీ యాదయ్యను సన్మానిస్తున్న ఎంఆర్‌పీఎస్ నాయకులు

**లింగోజిగూడ:** ఇటీవల బాధ్యతలు చేపట్టిన ఎల్‌బీనగర్ ఏసీపీ కృష్ణయ్య, హయత్‌నగర్ సర్కిల్ డీసీ తిప్పర్తి యాదయ్యలను ఎంఆర్‌పీఎస్ ఎల్‌బీనగర్ ఇన్‌ఛార్జి బత్తిన సుధాకర్ మాదిగా ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువాతో వారిని సన్మానించి పుష్పగుచ్చాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. నాయకులు ప్రకాష్, రాజా, మౌలాలి, రాజు, నరసింహ, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

## అనాథ విద్యార్థి గృహానికి విరాళం



విరాళంగా గ్రైండర్ తదితర వస్తువులు అందజేస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

**దిల్‌సుఖ్‌నగర్:** ఆర్‌కేపురం చిత్ర లేఅవుట్‌లోని విద్యార్థి గృహానికి దిల్‌సుఖ్‌నగర్‌లోని పుల్లారెడ్డి మెమోరియల్ స్కూల్ ఉపాధ్యాయులు, 10 తరగతి విద్యార్థులు కలిసి రూ. 40 వేల విలువైన వెజిటబుల్ కటింగ్ మిషన్, వ్యాక్యూమ్ క్లీనర్, గ్రైండర్ తదితర వస్తువులను విరాళంగా అందజేశారు.ఈ సందర్భంగా పుల్లారెడ్డి స్కూల్ ప్రిన్సిపాల్ జయశ్రీ మాట్లాడుతూ, విద్యార్థి గృహంలోని విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుంటూ ఉన్నత శిఖరాలకు చేరుకుంటున్నారని ప్రశంసించారు. కార్యక్రమంలో స్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## సిరిపురం యాదయ్యకు ఘన నివాళి



యాదయ్య విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఉపేందర్‌రెడ్డి తదితరులు

**దిల్‌సుఖ్‌నగర్:** మలిదశ ఉద్యమకారుడు, ప్రత్యేక తెలంగాణా కోసం అగ్నికి ఆహుతైన అమరుడు సిరిపురం యాదయ్య 14వ వర్ధంతిని మంగళవారం నిర్వహించారు. కొత్తపేట్ చౌరస్తాలోని యాదయ్య విగ్రహానికి తరంగ ఫౌండేషన్ అధ్యక్షుడు వెంకట్ ఆధ్వర్యంలో యువజన కాంగ్రెస్ నాయకుడు చిలుక ఉపేందర్‌రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు.కాంగ్రెస్ నాయకులు పెద్దపూర సైదులు, వంగాల శ్రీకాంత్‌రెడ్డి, నగేష్, రాజు, విప్లవ్ పాల్గొన్నారు.

## మలక్‌పేట సేవాదళ్ అధ్యక్షుడిగా రాజు



నియామక పత్రం అందుకుంటున్న రాజు

**చాదర్‌ఘాట్:** మలక్‌పేట నియోజకవర్గం కాంగ్రెస్ సేవాదళ్ అధ్యక్షుడిగా ఆకుల రాజు నియమితులయ్యారు. ఈ మేరకు సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు మహ్మద్ ఖాసీం జారీ చేసిన నియామక పత్రాన్ని సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడు మిద్దెల జితేందర్ మంగళవారం ఆకుల రాజుకు అందజేశారు. మలక్‌పేటలో కాంగ్రెస్ పార్టీ పటిష్టతకు కృషి చేస్తానని ఆయన ఈ సందర్భంగా అన్నారు. కాంగ్రెస్ నాయకులు కొమిరెల్లి రాజశేఖర్‌రెడ్డి, చాకి రవికుమార్, నారాయణరెడ్డి, గౌస్ పాల్గొన్నారు.

## లక్ష్యాన్ని ఎంచుకుని ముందుకు సాగాలి



**కాచిగూడ:** ప్రతి విద్యార్థి లక్ష్యాన్ని ఎంచుకుని ముందుకు సాగాలని వాసవీ ఆర్ట్ థియేటర్స్ చైర్మన్ డాక్టర్ నీలా శ్రీధర్ అన్నారు. వాసవీ పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపాల్ జయశ్రీరావు జన్మదినం సందర్భంగా మంగళవారం వాసవీ ఆర్ట్ థియేటర్స్ ఆధ్వర్యంలో స్కూల్ ప్రాంగణంలో ఆమెను ఘనంగా సన్మానించి అభినందించారు. విద్యార్థులు ఆటపాటలతో అలరించారు. శ్రీనివాస్‌రెడ్డి, ఆర్థరం సతీష్, వేణుగోపాల్, జి.పద్మావతి, పద్మశ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.